విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే



తేజస్‌ కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఒడిశా భువనేశ్వర్‌లో ఆగస్టు 11న జరిగిన 40వ సబ్‌ జూనియర్‌, 50వ జూనియర్‌ నేషనల్‌ ఆక్వాటిక్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీల్లో బాలానగర్‌ ఫిరోజ్‌గూడాకు చెందిన బేగంపేట్‌లోని హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌ 10వ తరగతి విద్యార్థి తేజస్‌కుమార్‌ 50, 100 మీటర్ల బట్టర్‌ ఫ్లై విభాగంలో రెండు కాంస్య పతకాలు, 200 మీటర్ల బట్టర్‌ఫ్లై విభాగంలో సిల్వర్‌ మెడల్‌ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలవగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లికి చెందిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేటర్‌ కోడిచర్ల మహేందర్‌

మోతీనగర్‌: కల్వర్టు పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్‌ కోడిచర్ల మహేందర్‌ అన్నారు. మూసాపేట డివిజన్‌ పరిధిలోని స్నేహపురి కాలనీలో కల్వర్టు పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పనులు కొనసాగుతాయన్నారు. రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకొని పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ అనురాగ్‌, కాలనీ అధ్యక్షులు వినోద్‌ యాదవ్‌, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌, అధికారులు

పంచశీల పాఠశాలలో రాఖీ వేడుకలు



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం ఆర్‌ఎస్‌ఎస్‌ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్‌ పండుగను శనివారం నిర్వహించారు. బ్రహ్మకుమారీలు విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. విద్యార్థులు కూడా ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాంటెండెంట్‌ పంచశీల శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రసన్న కుమార్‌, లక్ష్మి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నేతలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ జిల్లా సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్‌ కోరారు. శనివారం ఎంపీని కలిసి మాట్లాడారు. హిందూ శ్మశాన వాటికను ఆధునీకత పేరుతో మొత్తం తొలగించి అసంపూర్తిగా నిర్మాణాన్ని నిలిపివేశారని వివరించారు. అదేవిధంగా వివిధ సమస్యలపై చర్చించారు.

23 నుంచి అమ్మవారి శేష వస్త్రాల వేలం

కూకట్‌పల్లి: సుమిత్రనగర్‌లోని కనకదుర్గమ్మ దేవాలయంలోని అమ్మవారి చీరలు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు శుక్రవారం రోజుల్లో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

జ్యోతిబాపూలే నేషనల్‌ ఫెలోషిప్‌ అవార్డుకు ఎంపిక



శ్రీరామోజు శివకుమార్‌

అల్విన్‌కాలనీ: భారతీయ దళిత్‌ సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిబాపూలే నేషనల్‌ ఫెలోషిప్‌ అవార్డుకు ప్రగతినగర్‌, జగద్గిరిగుట్టకు చెందిన శ్రీరామోజు శివకుమార్‌ ఎంపికయ్యారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, సమాజానికి తనవంతు సేవలందించాలనే ఉద్దేశంతో 20 సంవత్సరాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పురోగతికి పాటుపడుతున్నారు. ఆయన సేవలను గుర్తించి డిసెంబర్‌ 8, 9 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సులో అవార్డును అందజేయనున్నారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



జేఎన్‌టీయూ ప్రధాన గేటు ఎదుట బెంగాల్‌ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు



హోలిస్టిక్‌ వైద్యులు, సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు, శ్రీకాంత్‌

నిరసన జ్వాలలు

కోల్‌కతా అత్యాచారం, హత్య ఘటనపై భగ్గుమన్న వైద్యులు

- నిందితులను శిక్షించాలని డిమాండ్‌
- జేఎన్‌టీయూ ప్రధాన గేటు వద్ద బెంగాల్‌ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో నిలిచిన ఓపీ సేవలు

పశ్చిమబెంగాల్‌ రాష్ట్రం, కోల్‌కతాలో జూనియర్‌ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటనపై శనివారం నియోజకవర్గంలో నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆసుపత్రుల వైద్యులు నిరసనలో పాల్గొన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ నిజాంపేట్‌ రోడ్డులోని హోలిస్టిక్‌ ఆసుపత్రి వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. జేఎన్‌టీయూ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ గర్ల్స్‌ వింగ్‌ ఆధ్వర్యంలో ప్రధాన గేటు వద్ద బెంగాల్‌ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలకు కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు.

– కూకట్‌పల్లి జోన్‌బృందం



ర్యాలీలో పాల్గొన్న రాందేవ్‌రావ్‌ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది



నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న బాలానగర్‌ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న వీఆర్‌ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది



నిరసన తెలుపుతున్న ప్రభుత్వ పట్టణ ఆరోగ్యశాఖ వైద్యాధికారి శాలిని



ర్యాలీలో పాల్గొన్న ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ నాయకులు, వైద్యులు

కార్పొరేటర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



బాలానగర్‌: ఓం శాంతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన బ్రహ్మకుమారీలు శనివారం కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌కు రాఖీ కట్టారు. అనంతరం మెడిటేషన్‌ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు మాధవి, పూర్ణా, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్‌ సిల్క్‌ ఎక్స్‌పో





మోతీనగర్‌: మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్‌ సిల్క్‌ ఎక్స్‌పో ప్రదర్శనకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. నిర్వాహకులు వికాస్‌ జైన్‌ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అన్ని రకాల ఫ్యాషన్‌ వస్తువులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హ్యాండ్లూమ్‌ సిల్క్‌ ఎక్స్‌పో సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. చేనేత వస్త్రాలతో పాటు డిజైన్‌ ఖాదీ వస్త్రాలు, పోచంపల్లి చీరలు, సల్వార్‌ సూట్స్‌తో పాటు కాశ్మీర్‌ శాలువాలు, కళాఖండాలు, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ జ్యువెలరీ పెయింటింగ్స్‌ జ్యూట్‌ బ్యాగ్స్‌తో పాటు వివిధ రకాలైన వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు 25 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

కాలనీ ఎన్నికల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న లయన్‌ అన్నెం కోటిరెడ్డి తదితరులు

మోతీనగర్‌: అవంతినగర్‌ ఈస్ట్‌ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని అవంతి నగర్‌ ఈస్ట్‌ కాలనీ అధ్యక్షులుగా పోటీ పడుతున్న లయన్‌ అన్నెం కోటిరెడ్డి, పి.నర్సింహారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం వేరువేరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీ సమస్యలు పరిష్కరిస్తామని, సేవ చేసే అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.

మంత్రికి ఆహ్వానం అందజేత



మంత్రి కొండా సురేఖతో నిర్వాహకులు

మోతీనగర్‌: రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌ గాంధీ విగ్రహం వద్ద భక్త మార్కండేయ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మార్కండేయ పూజ, గాయత్రి హోమానికి హాజరవ్వాలని మంత్రి కొండా సురేఖను శనివారం నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రధాన సలహాదారులు కేజీ వెంకటేశ్వరరావు నేత, ప్రభాకర్‌ నేత, అధ్యక్షులు ఉప్పల దామోదర్‌ నేత, ఉపాధ్యక్షులు తాటికొండ సంజీవ నేతలు ఉన్నారు.

అతివలకు బీమా.. ఎంతో ధీమా!

- ఉచిత రుణ బీమా, ప్రమాద బీమాతో ఆర్థిక సాయం
- మహిళా శక్తి పేరిట సంఘాలకు ప్రత్యేక రుణాలిస్తున్న సర్కారు
- రెండు రకాల బీమాతో గ్రామ, పట్టణాల్లో అమలు
- 1,09,361 మంది మహిళా సభ్యులకు ప్రయోజనం



సాక్షి, సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. అతివల కోసం రెండు రకాల బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థిక సాయం అందనుంది. మార్చిలోనే రుణ బీమా ప్రకటించగా.. తాజాగా ప్రమాద బీమాకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం ఇటీవల గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు జారీ చేసింది. ఈ రెండు పథకాలను గత మార్చి నుంచి అమల్లోకి తెచ్చింది.

1.09 లక్షల మహిళా సభ్యులకు ప్రయోజనం..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్‌ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్‌డీఏ,మెప్మా ఆధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పని చేస్తుండగా, ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు.వీరందరికి ప్రభుత్వం అమలు పరచనున్న రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)అధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి ఒక జిల్లా సమాఖ్య, ఐదు మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా, వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు.మెప్మా అధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్‌ లెవల్‌ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్‌ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పని చేస్తుండగా, ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

- ఈ సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి, చిరువ్యాపారులు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.


ప్రమాద బీమా రూ. 10 లక్షలు

స్వయం స్వహాయహక (పొదుపు) మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతి చెందితే.. వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ వంద శాతం వైకల్యం కలిగినా రూ. 10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే రూ. 5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలిపే సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు మాత్రమే ఇది వర్తింపజేస్తారు.

ప్రత్యేక దృష్టి సారిస్తేనే...

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాలి. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్‌ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తి స్థాయిలో అవగాహన లేదు. చాలా గ్రూపుల్లో నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్‌, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

మహిళలకు ఎంతో ప్రయోజనం...



మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని మండలాల్లో క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహించేలా చూస్తాం.

–సాంబశివరావు, డీఆర్డీఏ, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే గాంధీ



అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్‌, ఐటీ మంత్రి శ్రీధర్‌ బాబును ఎమ్మెల్యే గాంధీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చెరువులు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ, సీసీరోడ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తానని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం పావని శ్రీలత శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో ఆనంద నర్తన, మీనాక్షి పంచరత్న, ఆలోకయే, అంశాలను కళాకారులు సమన్వి, చైత్ర, కీర్తి, శ్రీయ వర్ధిని, పూర్వి, సుదీక్ష, షాలిని, అలేఖ్య, తనుశ్రీ,, హరిత ప్రదర్శించారు. మహంకాళీ సూర్యనారాయణ శర్మ శిష్యబృందం వాతాపి గణపతి, భామా కలాపం, ఒకపరి ఒకపరి, మాధవ, కేశవ, గోవిందా గోవిందా కీర్తనలకు లిఖిత, గీతికా, వర్షిత, భవ్య, శ్రీయ, కీర్తనలు నృత్య ప్రదర్శన ఇచ్చారు.

సంకీర్తనార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం ఐశ్వర్య భారతీ సంకీర్తనార్చన చేశారు. మత్స్యకూర్మ వరాహా, తిరుమలగిరిరాయ, తందనానా, సతులారా చూడరే తదితర అన్నమాచార్య కీర్తనలను ఆలపించి అలరించారు. వయోలిన్‌ విక్రమ్‌ తిరుపతి, మృదంగం పి.విద్యాసాగర్‌ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం డాక్టర్‌ శోభారాజు కళాకారులను సత్కరించారు.

బీసీ కుల గణన చేపట్టాలి

కుత్బుల్లాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ అమలుతో పాటు కుల గణన చేపట్టాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆరే మహేందర్‌ డిమాండ్‌ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణనను వెంటనే చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు మేడవరపు రాజేష్‌కుమార్‌, కోఆర్డినేటర్‌ దశరథం తదితరులు పాల్గొన్నారు.

పట్నం మహేందర్‌రెడ్డిని కలిసిన నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు

కూకట్‌పల్లి: కాంగ్రెస్‌ మేడ్చల్‌, మల్కాజ్‌గిరి ఇన్‌చార్జి పట్నం మహేందర్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో నియోజకవర్గ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. నియోజకవర్గంలో ఎటువంటి అధికారిక కార్యక్రమాలు జరిగినా నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి బండి రమేష్‌, తాను పాల్గొంటానని మహేందర్‌రెడ్డి తెలిపినట్లు చెప్పారు.

20న టీహబ్‌లో ప్రత్యేక సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఈనెల 20వ తేదీ 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సౌత్‌ఏషియన్‌ విమెన్‌ ఇన్‌ టెక్‌ (ఎస్‌ఏడబ్ల్యూఐటీ), టీహబ్‌ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఈ కార్యక్రమంలో 'ప్రాక్టికల్‌ ఇన్‌సైట్స్‌ ఇన్‌టూ డిప్లాయింగ్‌ జనరేటివ్‌ ఏఐ మోడల్స్‌' అనే అంశంపై జరిగే సమావేశంలో తెలంగాణ సీఐఐ ఐడబ్ల్యూఎన్‌ చైర్‌పర్సన్‌ విద్యారెడ్డి, టీహబ్‌ సీఈఓ శ్రీనివాసరావు, ఫిక్కీ ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్‌ ప్రియా గజ్దార్‌,యూఎస్‌ కాన్సులేట్‌ పబ్లిక్‌ ఎఫైర్స్‌ ఆఫీసర్‌ అలెగ్జాండర్‌ మెక్లరాన్‌, వీహబ్‌ సీఈఓ సీత పాల్గొంటారు.

19న హెచ్‌సీయూలో గోల్డెన్‌ జూబ్లీ లెక్చర్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ గోల్డెన్‌ జూబ్లీ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని స్కూల్‌ ఆఫ్‌ ఎకనామిక్స్‌ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 11.30 గంటలకు సీవీ రామన్‌ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఇందులో 'హ్యూమన్‌ క్యాపిటల్‌ ఇన్‌ ఇండియా: లెన్సెస్‌ ఓల్డ్‌ అండ్‌ న్యూ' అనే అంశంపై ఢిల్లీలోని ఇండియన్‌ స్టాటిస్టికల్‌ ఇన్‌స్టిట్యూట్‌లో ఎకనామిక్స్‌ అండ్‌ ప్లానింగ్‌ యూనిట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అభిరూప్‌ముఖోపాధ్యాయ ఉపన్యసిస్తారు.